జాడలేని వరుణుడు

- వర్షం కోసం తప్పని ఎదురుచూపులు
- ఇప్పటికే విత్తనాలు, ఎరువుల కొనుగోలు
- సిద్ధంగా దుక్కులు.. ఆందోళనలో రైతులు



దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)



బైరంపల్లి సమీపంలో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)

మాగనూర్: వరుణ దేవుడి కరుణ కోసం రైతన్న ఆకాశం వైపు ఆశగా ఎదురుస్తున్నాడు. జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతాయని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతరరణ శాస్త్రవేత్తలు వెల్లడించడంతో రైతులు దుక్కులు దున్నుకొని ఎరువులు చల్లుకొని భూములను సాగుకు అనుకూలంగా సిద్ధం చేశారు.

సాగు పనుల్లో రైతన్న..

మండలంలో రైతన్నలు వానకాలం పంటకు సమాయాత్తమవుతున్నారు. ఇప్పటికే సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎండలు మండుతున్నప్పటికి ఉదయం, సాయంత్రం వేళలో చేను పనుల్లో కనబడుతున్నారు. ప్రస్తుతం యాసంగి (రబీ) పంటలు ముగియడంతో వానకాలం పంటలకు రైతులు సిద్ధమయ్యారు. చెరువు మట్టి, పశువుల పేడ తీసుకొచ్చి భూమిని సారవంతం చేసుకునే పనులు ఉపందుకున్నాయి. ఈ సారి మంచి వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలు జోరుగా పండించే ఆవకాశాలు ఉన్నాయి.

ఎకరాల్లో..

ఖరీఫ్ సాగు మండల వ్యాప్తంగా ఎకరాలు సాగు విస్తీర్ణం ఉంటుంది. ప్రధానంగా వరి, పత్తి, మిరప, కంది పంటలు సాగుచేస్తుంటారు. వర్షాలు విస్తారంగా కురిసి ప్రాజెక్టు నిండితే ఖరీఫ్ పనులు ఉపందుకుంటాయి. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఒక వాన పడితే పనులు ముమ్మరంగా సాగనున్నాయి.

ఇబ్బందులు లేకుండా చూడాలి..



ఖరీఫ్ రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపిణీ చేసి, నకిలీ విత్తనాలు, మందులు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. విత్తనాలు, ఎరువులు కొనుగోలులో ఎలాంటి గొడవలు ఉండొద్దు.

- నరేష్, మాగనూర్ రైతు

వర్షం కోసం ఎదురుచూపులు..



గతేడాది జూన్ నెలలోనే నా రుమడి వేశాం. పత్తి విత్తనాలను పెట్టాం. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు భూముల్లో నల్లమట్టి, ఎరువులు చల్లి, దుక్కులు దున్ని వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం. వర్షాలు కురువగానే పనులు ప్రారంభిస్తాం.

- నర్సింహారెడ్డి, పెగడబండ రైతు

అందుబాటులో విత్తనాలు..



వానాకాలం వర్షాలు సమృద్ధిగా కురిస్తే మా అంచనాల కుమించి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. పత్తి ప్యాకెట్ ధరరూ.853 మాత్రమే ఇంతకంటే ఎక్కువ ధరకు అమ్మితే వెంటనే వ్యవసాయధికారికి సమాచారం అందజేయాలి.

- సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ మాగనూర్

ముగిసిన నవచండీ మహాయాగం



సింగారంలో కుంబాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం శ్రీ గిరిపీఠంపై నిర్వహిస్తున్న నవచండీ మహాయాగం ముగిసింది. నాలుగు రోజులుగా శ్రీ అంబాభవాని మందిరం నిర్వాహకులతో కలిసి శివానందస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. ఆదివారం అమ్మవారి ఆలయంలో కళశ ఉద్వాసన, సామ్రాజ్య పట్టాభిషేకం చేపట్టారు.అనంతరం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమా కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఎంపీపీ మధుకర్‌రావు



కోస్గి: సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం ఎంపీపీ మధుకర్ రావు, యూత్ కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి కలిశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన ఎంపీపీ ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో సీఎం రేవంత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో గుండుమాల్ మండలానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నారాయణపేటలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అమరచింతలో..



మదనాపురంలో..

నారాయణపేట రూరల్ : జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పయనిద్దామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్‌యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ దీక్ష పట్టాలని, ప్రజా సేవకు అంకితం కావాలన్నారు. అఖండభారత్ దేశం ఒకే చట్టం అనే నినాదంతో ముందుకు పోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లి, తెలంగాణలో రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు తెలియజేయాలని, ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ఒత్తిడి తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. కోటకొండ దాడి సంఘటనలో నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌గౌడ్, కిరణ్‌డగే, అంజి, తుల్జారాం, ప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.

మదనాపురం: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆదివారం మదనాపురం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బీజేపీ మండల నాయకులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు రాజశేఖర్ యాదవ్, కృష్ణా యాదవ్, రవి, వెంకటేశ్వర శెట్టి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: సమైఖ్య భారతం కోసం పోరాడిన మహా యోధుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం పట్టణంలో జరుపుకొన్నారు. బీజేపీ జెండా కట్ట వద్ద శ్యాంప్రదసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల నారాయణ, మరాఠి అశోక్, భాస్కర్, రాకేష్ శెట్టి, అనిల్, నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాయచూర్ ఎంపీకి అభినందన



కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని రాయచూర్ పార్లమెంట్ సభ్యుడు కుమార్‌నాయక్ కాంగ్రెస్ నుంచి గెలుపొందడంతో ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై మాట్లాడారు. ప్రధానంగా ఎన్నికల్లో అవిశ్రాంతంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేసిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సరిహద్దులోని తెలంగాణ, కర్ణాటక ప్రజలు అభివృద్ధి విషయంలో తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మండల నాయకులు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తకోట రూరల్: ప్రతిఒక్కరూ యోగా చేయాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని శిశుమందిర్ మాజీ ప్రధానాచార్యులు బాదం వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచి విద్యార్థులకు యోగా శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఒక క్లాస్ ఏర్పాటు చేసి వారితో ఆత్మస్థైర్యం, ఏకాగ్రత, పట్టుదల, జిజ్ఞాస పెంపొందేలా ప్రోత్సహించాలన్నారు. మనస్తత్వ పరిజ్ఞానం కల్పించి భవిష్యత్‌లో ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. యోగా చేసేందుకు ప్రతి పాఠశాలకు ఓ యోగా టీచర్ నియామకం చేపట్టాలన్నారు.

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఏది ?

మరికల్: మండల కేంద్రంలో ఏళ్ల తరబడి ఉన్న ప్రధాన సమస్యలపై ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి లేదని బీజేపీ నాయకులు రాజేష్, వేణు, రమేష్ అన్నారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న మండలంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు కాలేదన్నారు. అలాగే కూరగాయల మార్కెట్‌యార్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీంతోపాటు ప్రభుత్వ కార్యాలయలకు సొంత భవనాలు లేవన్నారు. పక్కనున్న ధన్వాడ, దేవరకద్ర మండలాల్లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలు ఉంటే మరికల్ మండలానికి మాత్రం ఎందుకు మంజూరు కావడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్పందించి మరికల్‌కు జూనియర్, డిగ్రీ కళాశాలతోపాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని వారు కోరారు.

అమరచింత ఖ్యాతిని నలుదిక్కుల చాటాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: ఎంతో చరిత్ర ఉన్న అమరచింత పట్టణ ఖ్యాతిని దేశ నలుదిక్కుల చాటి చెప్పేందుకు వివిధ రంగాల్లో యువకులు ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, ఎస్‌ఐ సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యుష డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. అమరచింత వేదికగా రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహించి ఇక్కడికి వచ్చిన వారిని ఆదరించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు తులసీరాజ్, మహేందర్ రెడ్డి,అరుణ్ కుమార్, నాగభూషణం గౌడ్, మేర్వరాజు నిర్వాహకులు వెంకటేష్, సూరి పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌ఓసీ చెక్కుఅందజేత



ఎల్‌ఓసీ చెక్కు అందజేస్తున్న చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని గుమ్మడం గ్రామానికి చెందిన చంద్రమ్మ అనారోగ్య సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన నాయకులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీ కాపిని ఆదివారం వనపర్తిలోని వారి ఇంటి వద్దకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి బాధితురాలి భర్త పెద్దరాములుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హరికుమార్‌రెడ్డి, కృష్ణయ్య, గొల్ల రాముడు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



హిందూ సామ్రాజ్య దినోత్సవంలో పాల్గొన్న వక్తలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో ఆదివారం బావ సమైక్య వేదిక, జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత, ఛత్రపతిశివాజీ చిత్రపటాలకు పూజలు చేసి వక్తలు ప్రసంగించారు. హిందూ సంస్కృతిని పరిరక్షించిన మహానుబావుడని, పరాక్రమాలకు ఆయనకు పెట్టింది పేరని కొనియాడారు. మరాఠా యోధులు ఛత్రపతి పట్టాభిషేక దినోత్సవాన్ని హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. త్వరలో జిల్లాకేంద్రంలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, బాలస్వామి, వెంకటరెడ్డి, కుర్మయ్య, రఘువీర్‌యాదవ్, శ్రీపాద్, శ్రీనివాసులు, వెంకట్రాములు, నర్సింహ, తాటికృష్ణ, కెంచె శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్, నరేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న చెంచులు

నారాయణపేట రూరల్: చెంచులపై జరుగుతున్న దాడులను పూర్తిగా అరికట్టాలని చెంచు మాదాస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కోటకొండలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో మాదాసి సంఘంపై ఇంకా చిన్నచూపు పోవడంలేదని, ఎక్కడ చూసిన అణిచివేత దోరణి పోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కచింతపల్లిలో ఈశ్వరమ్మ అనే మహిళను వారంరోజుల పాటు నిర్బంధించి చిత్రహింసలు పెట్టిన ముగ్గురు నిందితులను వెంటనే అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాఘవేందర్, కృష్ణ, పార్వతమ్మ, మణెమ్మ, ఎల్లమ్మ, బస్సమ్మ, చంద్రకళ, నరేష్, మంజుల, యశోద పాల్గొన్నారు.

మండల స్థాయి గిరకలాగుడు పోటీలు



నగదు బహుమతి అందజేస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్

అమరచింత: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పాంరెడ్డిపల్లెలో మండల స్థాయి గిరక లాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమ వృషభాలతో గిరకలాగుడు పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి మొదటి బహుమతిని సింగంపేట కైవసం చెసుకోవడంతో నగదు బహుమతిగా రూ.10 వేలను అందించారు. రెండో బహుమతిని ధర్మపురం సాధించి రూ.5 వేల నగదు బహుమతి, మూడు, నాలుగు బహుమతులను పాంరెడ్డిపల్లె గ్రామ వృషాభాలు సాధించడంతో సంబంధిత రైతులకు నగదు ప్రోత్సాహకాలను అందించామని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీసీ రెడ్డి తెలిపారు. బహుమతి ప్రదాతగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ అందించగా డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ నాయకులు విష్ణు పాల్గొనారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



సర్టిఫికెట్లు, బెల్టులు సాధించిన విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 'గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్' కరాటే ఆకాడమి ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పరీక్షల్లో 16 మంది విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు హరీష్‌యాదవ్, జాఫర్ సాదిక్, బాబా అజ్మీర్, కార్తికేయయాదవ్, సురేందర్, అరవింద్, హర్షవర్ధన్, పవన్‌తేజ్, గౌస్‌పాషా తదితరులు ఉన్నారు.

భూత్పూరు కాల్వలో పూడికతీత



అమరచింత శివారులో భూత్పూరు కాల్వలో పూడిక తొలగిస్తున్న జేసీబీ

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువుకు సాగు నీటిని అందిస్తున్న భూత్పూరు రిజర్వాయర్ కాల్వలో పేరుకుపోయిన పూడికతీతతో పాటు ముళ్లపొదలను మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి సొంత డబ్బులతో పనులను చేపడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో జూరాల నుంచి భూత్పూరు రిజర్వాయర్‌కు నీరు వదలడంతో ఎప్పుడు కాల్వకు సాగునీరు వదిలినా.. పూడిక తీయించడంలేదు. దీంతో నీరు ముందుకు సాగడం లేదు. రైతుల విన్నపం మేరకు పట్టణానికి చెందిన దేశాయి ప్రకాష్ రెడ్డి చెరువుకు సాగునీరు అందాలన్న లక్ష్యంతో సొంతంగా జేసీబీతో కాల్వలో పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు. దీంతో చెరువు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దుండగులను అరెస్ట్ చేయాలి

ఊట్కూరు: నారాయణపేట మండలంలోని కోటకొండలో దళితులపై అకారణంగా దాడి చేసినవారిని అరెస్ట్ చేయాలని దళిత సంఘం నాయకులు కొక్కు శంకర్ ఆదివారం డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళితులపై అకారణంగా దాడిచేసినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసున మోదు చేసి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కొండన్‌గోపాల్, నాయకులు లింగప్ప, గౌత, నారాయణ, హన్మంతు, తిమ్మప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



నారాయణపేట రూరల్: పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేద పంచకర్మ ఎండీ వైద్యులు డాక్టర్ ఉమా, రవళి బృందం హాజరై నరాలకు సంబంధించిన వ్యాధులు, మోకాళ్లనొప్పులు, చర్మవ్యాధులు, నడుమునొప్పి, కీళ్లవాతం, సొరియాసిస్, మెడనొప్పి తదితర దీర్ఘకాలిక వ్యాధులకు శాస్త్రీయ పద్ధతిలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 150 మందికి పరీక్షించిన వైద్య బృందం వారికి దినసరి ఆహార నియమాలు, జీవనశైలిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో రతంగపాండురెడ్డి, ఓంప్రకాష్, లక్ష్మి, సతీష్, మధన్, వినోద్, రమేష్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ కార్యాలయం

మరికల్: మండల కేంద్రంలోని ఎనిమిది ఏళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయం నిరుపయోగంగా పడి ఉండటంతో శిథిలావస్థకు చేరింది. సరైనా డ్రెయినేజీ వ్యవస్థలేక మురుగునీరు భవనంలోకి రావడంతో అధికారులు ఖాళీ చేశారు. పాలకులు, అధికారులు స్పందించి ఎదైనా ప్రభుత్వ కార్యాలయ నిర్మాణపనులు చేసేలా చర్యలు తీసుకోవాలని లేనిచో కబ్జాకు గురయ్యే అవకాశం ఉంది.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

మాగనూర్: మండలంలోని చిన్న, సన్నకారు రైతులు ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నట్లు ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్ అన్నారు. మండల పరిధిలోని జాబ్‌కార్డు కలిగిన రైతులకు ఉపాధి హామీ పథకంలో వివిధ పండ్ల తోటలు పెంచుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా గట్లపై కొబ్బరి మొక్కలు, మునగ మొక్కలు పెంచుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా ఆసక్తిగల వారు ఉంటే పంచాయతీ కార్యదర్శికి లేదా ఉపాధిహామీ సిబ్బందికి వివరాలు తెలియజేయాలన్నారు. ఈ నెల 25వరకు దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ అన్నారు.

జాతీయ రహదారిపై భారీ గేట్స్ ఏర్పాటు



మరికల్: జాతీయ రహదారిపై వాహనాలు వేగ నియంత్రణ పాటించాలని యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్ అన్నారు. మండలంలోని ఆదివారం జాతీయ రహదారిపై భారీ గేట్స్‌ను ఏర్పాటు చేశారు. రాయిచూర్, నారాయణపేట, మహబూబ్‌నగర్ రహదారులపై బైక్‌లు, ఇతర వాహనాలు అతివేగంగా వెళ్లడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. వాహనదారులు వేగాన్ని నియంత్రించుకొని వెళ్లాలని, అలాగే భారీగేట్స్‌ను గమనించాలని సూచించారు. కార్యక్రమంలో యువక మండలి ప్రధాన కార్యదర్శి రఘు, రవి, వెంకట్, రాము తదితరులు పాల్గొన్నారు.

పట్వారి రాములుకు ఘన నివాళి



మరికల్: పట్వారి రాములు సేవలు మరవలేమని ప్రొఫెసర్ కే వై రత్నం అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన పట్వారి రాములు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం గ్రామంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి పేదల సమస్యలపై అలుపెరగని యోధుడిల పోరాడి వారి సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి, ప్రజా సంఘాల నాయకులు చక్రవర్తి, సరోజన, ఖలీల్, మహాదేవ్, చైతన్య, శ్రీదేవి, నర్సింహులు, యాదయ్య పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం పెద్ద వాగు నుంచి శనివారం రాత్రి మక్తల్ మండలంలోని సంగంబండ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, నేరడగం గ్రామానికి చెందిన మరో వ్యక్తి కలిసి అక్రమంగా మూడు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నారు. సంగంబండకి చెందిన నర్సప్ప, బొందలకుంట రాజిరెడ్డి (నేరడగం) మారెప్ప ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్లను తరలిస్తుండగా వారిని పట్టుకుని పోలిస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్‌లపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.